సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీసాలతో

యాంటీ బయాటిక్ నిరోధకత!

న్యూఢిల్లీ: ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ సీసాల్లోని నానో ప్లాస్టిక్‌లు యాంటీ బయాటిక్ నిరోధకతను పెంచే ప్రమాదం ఉందని మొహాలీలోని సూక్ష్మ శాస్త్ర, సాంకేతిక సంస్థ(ఐఎన్ఎస్‌టీ) శాస్త్రవేత్తలు తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యం, యాంటీ బయాటిక్ నిరోధకతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ జర్నల్ నానో స్కేల్‌లో ప్రచురితమైన ఈ కొత్త అధ్యయనం ఇప్పటిదాకా గుర్తించని ప్రజారోగ్య ప్రమాదాన్ని గురించి నొక్కి చెప్పింది. మానవ జీర్ణాశయ వ్యవస్థ(గట్)లోకి నానో ప్లాస్టిక్స్ చేరి సూక్ష్మజీవులతో కలుస్తున్నాయని, ఇవి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని అధ్యయనం తెలిపింది. నానో ప్లాస్టిక్స్ యాంటీ బయాటిక్ నిరోధకత కలిగిన జన్యువులను లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్ లాంటి ప్రయోజకర బ్యాక్టీరియాలోకి చేరుస్తున్నాయని, దీంతో గట్ బ్యాక్టీరియా దెబ్బతింటున్నదని పరిశోధకులు గుర్తించారు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతుందని తేల్చారు.

'నమ్మకంపై నిర్మించుకునే బంధమే పెండ్లి'

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: పెండ్లి అనేది పరస్పర నమ్మకం, సహచర్యం, పంచుకున్న అనుభవాలపై నిర్మించుకునే బంధమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. తమిళనాడుకు చెందిన ఓ జంట 2004 నుంచి విడిగా ఉంటున్నారు. వీరికి 2018లో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ విడాకులు మంజూరు చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. 'వివాహ బంధానికి కీలకమైన పరస్పర నమ్మకం, సహవాసం, అనుభవాలు పంచుకోవడం అనే అంశాలు చాలా కాలం పాటు దంపతుల నడుమ లేకపోతే ఆ వివాహ బంధం కేవలం చట్టపరమైన లాంఛనంగా మారిపోతుంది' అని పేర్కొన్న ధర్మాసనం మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించింది. భార్యకు భరణం కింద రూ.50 లక్షలు, కూతురి చదువు, పెండ్లి కోసం మరో రూ.50 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది.

ధ్యానం లగ్జరీ కాదు.. అవసరం

ఐరాసలో శ్రీశ్రీ రవిశంకర్ కీలక ప్రసంగం

ఐక్య రాజ్య సమితి, డిసెంబర్ 21: కొందరు భావిస్తున్నట్టు ధ్యానం కొందరికి మాత్రమే పరిమితమైన విలాస ప్రక్రియ కాదని, అది ప్రతి ఒక్కరికీ అవసరమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో మతాలు,సరిహద్దులకు అతీతంగా దౌత్య సంబంధాలను పటిష్టపరిచే శక్తివంతమైన ఆయుధమే ధ్యానమని ఆయన ప్రకటించారు. మొట్టమొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఐరాసలోని భారత శాశ్వత మిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కీలకోపన్యాసం చేస్తూ ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరైనా ధ్యానం చేయవచ్చని, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తూ ధ్యానంపై ఎవరికైనాఅభ్యంతరాలు ఉంటే వాటిని తొలగిస్తుందని చెప్పారు. ధ్యానం అన్ని మతాలకు, భౌగోళిక సరిహద్దులకు, వయో భేదాలకు అతీతమైనదని, ఇది అందరికీ ఎంతో ఉపయోగకరమైనదని రవిశంకర్ చెప్పారు. ధ్యానం లగ్జరీ కాదు..ప్రస్తుతం అత్యంత అవసరంగా ఆయన అభివర్ణించారు. యూఎన్ జనరల్ అసెంబ్లీ 79వ సమావేశం అధ్యక్షుడు ఫిలెమన్ యాంగ్ ప్రసంగిస్తూ ధ్యానం ద్వారా ఆత్మశోధనకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులతో కూడిన భవిష్యత్తు ప్రపంచాన్ని అందచేయడానికి శాంతి మార్గంలో పయనిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

అంగీకార శృంగారం రేప్ కాదు

- వేధింపుల కోసం చట్టాన్ని వాడుకోవద్దు
- ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారాన్ని లైంగిక దాడిగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్లను కొందరు పురుషులను వేధించేందుకు ఉపయోగిస్తున్నారని స్పష్టం చేసింది. తనపై నమోదైన రేప్ కేసును కొట్టివేయాలంటూ ఓ యువకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ చంద్రధారి సింగ్‌తో కూడిన ధర్మాసనం యువతి ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. ఈ మేరకు యువకుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ, తీర్పు సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. "అత్యాచారం మహిళలపై జరిగే చాలా హేయమైన చర్య. కానీ కొందరు మహిళలు తమతో సంబంధం కలిగిన పురుషుడిని వేధించేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. యువకుడు సమర్పించిన వాట్సప్ చాటింగ్‌లు, రికార్డింగ్స్ బట్టి చూస్తే ఇద్దరూ పరస్పరం అంగీకారంతోనే శారీరక బంధంలోకి ప్రవేశించినట్టు స్పష్టమవుతున్నది. స్త్రీలు చట్టాన్ని దుర్వినియోగం చేయడం వల్ల పురుషులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చెప్పేందుకు ఈ కేసు స్పష్టమైన ఉదాహరణ. ఇలాంటి కేసుల్లో ఫిర్యాదుదారుల ఉద్దేశాలను కూడా కోర్టులు పరిశీలించాలి." అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది యువకుడిపై యువతి తీవ్రమైన ఆరోపణలు చేశారని, కేసును కొట్టివేయవద్దని కోరారు. స్పందించిన న్యాయమూర్తి "ఆధారాల ప్రకారం చూస్తే ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ కులాలు వేర్వేరు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమని యువకుడు తెలిపాడు. కానీ ఆమె మరో యువకుడితో పెళ్లికి అంగీకరించడంతో ప్రేమించిన యువకుడితో పెళ్లికి ఆసక్తి చూపలేదు" అని న్యాయమూర్తి తెలిపారు. అందువల్ల యువకుడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దురుద్దేశపూర్వకమైనదనని, కాబట్టి కేసు చెల్లదని స్పష్టం చేశారు.

ఎన్‌పీఏల పాపం యూపీఏదే

- ప్రభుత్వంలోని అవినీతే అందుకు కారణం
- వాటి రద్దుపై మోదీ చర్యలు ప్రశంసనీయం
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: యూపీఏ ప్రభుత్వ హయాంలోని అవినీతి కారణంగానే బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగిపోయాయని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆరోపించారు. ఈ సమస్యను అధిగమించడానికి వాటిని రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ప్రశంసించారు. నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వద్దకు తాను వెళ్లి 'బ్యాంకుల్లో వసూలు కానీ బాకీల నుంచి బయటపడాలి. అవి వసూలు అవ్వకపోతే మనం రుణాలు ఇవ్వలేం. వ్యవస్థను శుభ్రం చేయాలి' అని చెప్పగా, సరే అలాగే ముందుకు సాగండి అని ఆయన అనుమతి ఇచ్చారని అన్నారు. గత యూపీఏ ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా పెద్దయెత్తున బ్యాంకుల్లో మొండి బకాయిలు పేరుకుపోయాయన్నారు.'ఆర్థిక సంక్షోభం తర్వాత గతంలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు ఇబ్బందుల్లో పడ్డాయి. భారత దేశం ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని మించి ఇబ్బందులు ఎదుర్కొంది. యూపీఏ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాల కారణంగా ప్రాజెక్టుల అనుమతిలో తీవ్ర జాప్యం ఏర్పడింది. పర్యావరణ అనుమతులు లభించ లేదు. దాంతో ఆర్థిక వ్యవస్థలో ఎన్‌పీఏలు కూడా పేరుకుపోయాయి' అని ఆయన వివరించారు. ఈ ఆర్థిక సంక్షోభం కారణంగా తన ముందు పాలకులు ఆర్‌బీఐలో రుణాలను మొండి బకాయిలుగా ప్రకటించడంపై మారటోరియను అనుమతించే విధానాన్ని అమలు చేశారని చెప్పారు. దీని ఫలితంగా బ్యాంకుల్లో మొండి బకాయిలను గుర్తించకుండా ఉంచడంతో అవి పెద్దమొత్తంలో పేరుకుపోయాయన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన మొదటి ఏడాది 2014లోనే మారటోరియాన్ని రద్దు చేశానన్నారు. దాంతో చాలా మొండి బకాయిలు కూడా రద్దయ్యాయన్నారు. ఇలాంటి ప్రక్షాళన బ్యాంకింగ్ వ్యవస్థకు అవసరమని అన్నారు. ఈ మొండి బకాయిలను బ్యాలెన్స్ షీట్‌లో ప్రతి ఏడాది చూపుకుంటూ పోతే బ్యాంకులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేవని, కొత్త రుణాలు ఇవ్వలేవని రఘురామ్ రాజన్ అన్నారు.

ఎన్‌పీఏ అంటే ఏమిటి?

బ్యాంకులు ఖాతాదారులకు ఇచ్చే రుణాన్ని ఆస్తిగా పరిగణిస్తాయి. ఇలా తాము ఇచ్చిన రుణంపై అసలు కానీ, వడ్డీ కానీ వసూలు కాకపోతే బ్యాంకుకు నష్టం కనుక వాటిని నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా పరిగణిస్తాయి. అందుకే వీటిని నియంత్రించడానికి ఆర్‌బీఐ నిత్యం అనేక విధానాలను ప్రవేశపెడుతూ ఉంటుంది. బ్యాంకు రుణ పోర్ట్‌పోలియో చూసినప్పుడు ఈ ఎన్‌పీఏల శాతం తక్కువగా ఉండాలి. ఈ ఎన్‌పీఏల శాతం ఎక్కువగా ఉంటే ఆ బ్యాంకు పరిస్థితి ఆశాజనకంగా లేదని అర్థం. ఒక పారిశ్రామికవేత్త వెయ్యి కోట్లు రుణం తీసుకుని చెల్లించకపోతే బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో ఆ వెయ్యి కోట్లను ఎన్‌పీఏలుగా చూపిస్తారు. ఈ ఎన్‌పీఏల ప్రభావం బ్యాంకు లాభదాయకతపై పడుతుంది. ఎన్‌పీఏల శాతం ఎక్కువగా ఉంటే బ్యాంక్ దివాలా కూడా తీయవచ్చు.

జనవరి 3 నుంచి యూజీసీ నెట్ పరీక్ష

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్-2024 విడత పరీక్షలు జనవరి 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపింది. పీహెచ్‌డీ ప్రవేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)కు అర్హతగా నెట్ పరీక్షను నిర్వహిస్తారు.

ఏప్రిల్ 23 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్

మే 18న పరీక్ష నిర్వహణ

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ షెడ్యూల్ విడుదలైంది. జేఈఈ మెయిన్ తుది ఫలితాలు 2025 ఏప్రిల్ 23న లేదా అంతకుముందే విడుదలవుతాయని ఐఐటీ కాన్పూర్ పేర్కొన్నది. మెయిన్ ర్యాంకర్లు ఏప్రిల్ 23 నుంచి మే 2వ తేదీ వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. మే 5 వరకు ఫీజు చెల్లించి, మే 11 నుంచి 18 వరకు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నది.

ఐరాస న్యాయమండలి చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకూర్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితి అంతర్గత న్యాయమండలి చైర్‌పర్సన్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్ నియమితులయ్యారు. 2028 నవంబర్ 12 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రెస్ తెలిపారు. జస్టిస్ లోకూర్ ఫిజీ సుప్రీం కోర్టులోని నాన్ రెసిడెంట్ ప్యానల్‌కు 2019లో జడ్జీగా నియమితులయ్యారు. విదేశీ సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా మన దేశ సుప్రీం కోర్టు న్యాయమూర్తి నియమితులు కావడం అదే ప్రథమం. లోకూర్ 2012లో సుప్రీం కోర్టు జడ్జీగా బాధ్యతలు చేపట్టి 2018 డిసెంబర్ వరకు కొనసాగారు.

ఫడ్నవీస్‌కు హోం.. అజిత్‌కు ఫైనాన్స్

మహారాష్ట్ర క్యాబినెట్‌పై షిండే ఆశలు గల్లంతు

ముంబై: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ఎట్టకేలకు శనివారం శాఖల కేటాయింపు ప్రకటన చేసింది. ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు కీలకమైన హోం శాఖ కూడా లభించగా ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖలు లభించాయి. ఇక శివసేన నాయకుడు, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు తీవ్ర నిరాశ ఎదురైంది. హోంశాఖపై ఆయన పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. డిప్యూటీ సీఎంతో పాటు ఆయనకు పట్టణాభివృద్ధి, హౌసింగ్, పబ్లిక్ వర్క్స్ శాఖలు దక్కాయి. హోం శాఖతోపాటు ఫడ్నవీస్ కీలక శాఖలైన ఇంధనం, న్యాయ, సాధారణ పరిపాలన, సమాచార, ప్రచార శాఖలను తన వద్దనే ఉంచుకున్నారు. ఆర్థిక, ప్రణాళిక శాఖలతోపాటు ఎక్సైజ్ శాఖను అజిత్ పవార్‌కు కేటాయించారు.

'ప్రియాంక గెలుపును రద్దు చేయాలి'

కొచ్చి: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రా గెలుపును రద్దు చేయాలని ఆమె ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ కోరారు. ఈ మేరకు నవ్య కేరళ హైకోర్టులో ఓ పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రియాంక తన, తన కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను, కేసుల జాబితాను వెల్లడించడంలో విఫలమయ్యారని ఆమె ఆరోపించారు. ప్రియాంక ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారన్నారని తెలిపారు. ఇది అవినీతికి పాల్పడటమేనని చెప్పారు.

అలప్పుళ రైలులో అగ్ని ప్రమాదం

ఇల్లందువాసులు సురక్షితం

తిరువనంతపురం: అలప్పుళ ఎక్స్‌ప్రెస్ రైలు (13351) కేరళలోని మధుకర్రై స్టేషన్ వద్ద శనివారం అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ రైలులో శబరిమలకు వెళ్తున్న తెలంగాణ ఇల్లెందుకు చెందిన 10 మంది అయ్యప్ప మాలాధారులు సురక్షితంగా ఉన్నారు. ఈ రైలు ధనాబాద్ జంక్షన్ నుంచి అలప్పుళ వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. బీ4, బీ5 బోగీల్లో మంటలను గుర్తించిన స్టేషన్ సిబ్బంది వెంటనే రైలును నిలిపేశారు. ప్రయాణికులు కూడా ప్రమాదాన్ని గుర్తించి హుటాహుటిన రైలు నుంచి దిగిపోయారు.

గాజాపై వైమానిక దాడులు..

77 మంది మృతి

గాజా: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో శుక్రవారం 77 మంది మరణించినట్టు గాజా ఆరోగ్య శాఖ శనివారం వెల్లడించింది. మృతుల్లో ఐదుగురు చిన్నారులున్నారని, 174 మంది గాయపడ్డారని తెలిపింది. నిరాశ్రయులు తలదాచుకున్న షాబన్ రయాస్ స్కూలుపై గురువారం ఇజ్రాయెల్ సేనలు జరిపిన వైమానిక దాడులలో ఐదుగురు పిల్లలతోసహా 12 మంది మరణించారు. గురువారం తెల్లవారుజామున దీర్ అల్ బలాలోని మగజీ శరణార్థ శిబిరంపై జరిగిన మరో వైమానిక దాడిలో ఐదుగురు మరణించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు గాజాలో మొత్తం 45,206 మంది మరణించారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జైపూర్, డిసెంబర్ 21: పోటీ, ప్రవేశ పరీక్షల కేంద్రంగా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జేఈఈకి సిద్ధమవుతున్న బీహార్‌కు చెందిన 16 ఏండ్ల విద్యార్థి విజ్ఞాన్ నగర్‌లో తానుంటున్న హాస్టల్‌లో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జేఈఈలో శిక్షణ పొందేందుకు ఏప్రిల్‌లో కోటాకు వచ్చిన ఈ విద్యార్థి తన ఆత్మహత్యకు కారణమేమిటో ఎలాంటి సూసైడ్ నోట్ రాయలేదని కోటా డీఎస్పీ లోకేంద్ర పల్లీవాల్ తెలిపారు. కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కోటాలో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ఏడాది 27 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని అధికారులు వివరించారు.

సంభల్ ఆలయంలో ఏఎస్ఐ సర్వే

పురాతన బావి తనిఖీ

సంభల్(యూపీ), డిసెంబర్ 21: ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్ జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చిన కల్కి విష్ణు ఆలయాన్ని సర్వే చేసిన మరుసటి రోజే భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆ ఆలయ ప్రాంగణంలో ఉన్న పురాతన బావిని శనివారం తనిఖీ చేసింది. ఆలయ ప్రాంగణంలో కృష్ణ కూపం(బావి) ఉందని ఆల య పూజారి మహేంద్ర ప్రసాద్ శర్మ తెలిపారు. బావి చాలా పురాతనమైనదని అది ఎప్పటిదో నిర్ధారించాల్సి ఉందని సంభల్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వందనా మిశ్రా చెప్పారు.

కంటైనర్ ట్రక్ బోల్తా

బెంగళూరులో ఆరుగురి మృతి

బెంగళూరు, డిసెంబర్ 21: కంటైనర్ ట్రక్ బోల్తా పడిన ప్రమాదంలో ఆరుగురు మరణించిన సంఘటన బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై భారీ లోడ్‌తో వెళ్తున్న ఒక కంటైనర్ ట్రక్ నెలమంగళ వద్ద బోల్తా పడింది. దాంతో పక్కనే ఉన్న ఒక కారు, బైక్ దాని కింద నలిగిపోవడంతో అందులో ఉన్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

రైల్వేలకు 'కవచం' ఇది!

పొగ మంచులోనూ సమర్థంగా పనిచేసిన వ్యవస్థ

న్యూఢిల్లీ: రైల్వే ప్రమాదాల నిరోధక వ్యవస్థ 'కవచ్' లోకో పైలట్స్‌కు ఎంతో సహాయకారిగా నిలుస్తున్నది. రైలు వేగ నియంత్రణ, పర్యవేక్షణతో పాటు సిగ్నల్స్‌కు సంబంధించి సమస్త పనులూ 'కవచ్' చేపడుతుంది. దట్టమైన పొగమంచు, అనూహ్యమైన వాతావరణ పరిస్థితుల్లోనూ రైల్వే ప్రయాణం సాఫీగా సాగేలా 'లోకో పైలట్'కు సాయం చేస్తుంది. ఇందుకు సంబంధించిన వీడియోను రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ 'ఎక్స్'లో శనివారం విడుదల చేశారు. దట్టమైన పొగమంచులో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్న ఓ రైలులో..కవచ్ మానిటర్ 'గ్రీన్ సిగ్నల్' చూపటం అందులో కనిపించింది. సిగ్నలింగ్, రైలు వేగం నియంత్రణ, ప్రమాదాల్ని అడ్డుకోవటం, 'లోకో పైలట్' ప్రమేయం లేకుండా బ్రేక్స్ వేయటం..మొదలైన పనులను 'కవచ్' నిర్వహిస్తుంది.

ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్ల పరిశీలనపై ఆంక్షలు

ఎన్నికల నిబంధనల సవరణ

న్యూఢిల్లీ: ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులు వంటి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను ప్రజల పరిశీలన నుంచి నివారించేందుకు ఎన్నికల నిబంధనను కేంద్రం సవరించింది. ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు దుర్వినియోగం కాకుండా అడ్డుకునేందుకే ఈ చర్యను చేపట్టినట్టు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల కమిషన్ సిఫార్సు ఆధారంగా 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని 93(2)(ఎ) నిబంధనను కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం సవరించింది. ప్రజల పరిశీలనకు అవకాశం కల్పించే పత్రాలు లేదా డాక్యుమెంట్లపై ఆంక్షలు విధించడమే ఈ సవరణ ఉద్దేశం. 93 నిబంధన ప్రకారం ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను ప్రజలు పరిశీలించవచ్చు. "పత్రాలు" అన్న పదం తర్వాత "నిబంధనలు నిర్దేశించినట్టుగా" అన్న పదాన్ని ప్రభుత్వం ఇప్పుడు ఈ నిబంధనలో చేర్చింది. ఎన్నికల పత్రాలు, డాక్యుమెంట్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, పోలింగ్ స్టేషన్ల సీసీటీవీ ఫుటేజీ దుర్వినియోగం కారాదన్న ఉద్దేశంతో ఆ ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను మాత్రం ప్రజల పరిశీలనలో ఉంచబోమని ఆయన స్పష్టం చేశారు.

రష్యా కజాన్ నగరంలోని ఓ భవనంపైకి దూసుకెళ్తున్న డ్రోన్

రష్యాపై '9/11' తరహా దాడులు

డ్రోన్లు ప్రయోగించిన ఉక్రెయిన్

కజాన్: అమెరికాలో జరిగిన 9/11 దాడుల తరహాలో రష్యాకు చెందిన కజాన్ నగరంలోని బహుళ అంతస్తుల భవనాలపై ఉక్రెయిన్ శనివారం డ్రోన్ దాడులు నిర్వహించింది. కమికాజ్ డ్రోన్లతో ఉక్రెయిన్ ఈ దాడులు జరిపినట్లు మీడియా కథనాలు తెలిపాయి. బహుళ అంతస్తుల నివాస భవనాలను డ్రోన్లు నేరుగా ఢీకొన్న దృశ్యాలను 9/11 తరహా దాడులుగా కొందరు నెటిజన్లు అభివర్ణించారు. దాడి జరిగిన ప్రాంతానికి ఎమర్జెన్సీ సర్వీసులు బయల్దేరి వెళ్లినట్లు రష్యన్ వార్తా సంస్థ టాస్ తెలిపింది. ఈ దాడిలో ప్రాణనష్టం జరిగినట్లు తెలియరాలేదని, దాడికి గురైన భవనాల నుంచి ప్రజలను ఖాళీ చేయిస్తున్నట్లు తెలిసింది. తమ టటరస్తాన్ రిపబ్లిక్‌పై ఎగురుతున్న మానవ రహిత వాహనాన్ని రక్షణ దళాలు కూల్చివేసినట్టు రష్యా రక్షణ శాఖ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరిగింది.

వాట్సాప్ యూజర్లపై పెగాసస్ నిఘా

- ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత
- ధ్రువీకరించిన అమెరికా కోర్టు

న్యూయార్క్: వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లలో అక్రమంగా పెగాసస్ స్పైవేర్‌ను జొప్పించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ సంస్థపై మెటా దాఖలు చేసిన కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌ల హ్యాకింగ్‌కు ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేసింది. వాట్సాప్‌లోని బగ్‌ను ఉపయోగించుకొని అక్రమంగా స్పైవేర్‌ను జొప్పించిందని ఎన్ఎస్ఓ గ్రూప్‌పై మెటా సంస్థ 2019లో అమెరికా కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఫిల్లిస్ హమిల్టన్.. 1400 మంది వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లు లక్ష్యంగా మారడానికి పెగాసస్ స్పైవేర్ తయారుచేసిన ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సంస్థ సంబంధిత చట్టాల్లోని నిబంధనలను ఉల్లంఘించిందని పేర్కొన్నారు. కోర్ట్ వ్యాఖ్యల పట్ల మెటా సంస్థ హర్షం వ్యక్తం చేయగా, ఎన్ఎస్ఓ గ్రూప్ స్పందించలేదు.

భారత్‌లోనూ పెగాసస్ ప్రకంపనలు

పెగాసస్ స్పైవేర్ ఉదంతం భారత్‌లోని ప్రకంపనలు రేపిన సంగతి తెలిసిందే. 300 భారతీయ మొబైల్ నెంబర్లపై పెగాసస్‌ను వినియోగించారని 2021లో వార్తలు వచ్చాయి. ఇందులో అప్పటి ఇద్దరు కేంద్రమంత్రులు, ముగ్గురు ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, వ్యాపారులు ఉన్నట్టు ఆరోపణలు సంచలనం రేపాయి. అయితే, ఈ ఆరోపణలకు ఆధారాలు లేవని అప్పటి ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంటులో ప్రకటించారు. ఇప్పుడు అమెరికా కోర్టు తీర్పు నేపథ్యంలో మరోసారి దేశంలో పెగాసస్ స్పై వేర్ చర్చనీయాంశంగా మారింది.

బంగ్లాదేశ్‌లో మళ్లీ హిందూ ఆలయాలపై దాడి

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై దాడులు ఆగడం లేదు. మైమెన్‌సింగ్, దినాజ్‌పూర్ జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో మూడు ఆలయాలపై దుండగులు దాడికి తెగబడి, ఎనిమిది విగ్రహాలను ధ్వంసం చేశారు. అలాలుద్దీన్ అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ఢిల్లీ స్కూళ్లలో బంగ్లాదేశీలు ఉన్నారేమో గుర్తించండి

ఢిల్లీలోని పాఠశాలల్లో బంగ్లాదేశ్‌కు చెందిన పిల్లలు ఉన్నారేమో గుర్తించాలని పాఠశాలలకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సర్క్యులర్ జారీ చేసింది. ఎవరైనా ఉంటే తెలియజేయాలని ఆదేశించింది.

హుండీలో జారిపడ్డ ఐఫోన్ దేవుడికే!

చెన్నై: తమిళనాడులో దినేశ్ అనే ఓ భక్తుడికి ఊహించని అనుభవం ఎదురైంది. తిరుపోరూర్‌లోని కందస్వామి ఆలయంలో అతడి ఐఫోన్ అనుకోకుండా హుండీలోకి జారిపడింది. ఖరీదైన తన ఫోన్‌ను తిరిగి ఇవ్వాలని అతడు కోరగా.. 'నిబంధనల ప్రకారం అలా ఇవ్వలేం. ఆ ఫోన్ ఇక దేవుడి ఖాతాలోకి వెళ్లినట్టే!' అని దేవాదాయ శాఖ శనివారం సమాధానమిచ్చింది. అందులోని డాటాను తీసుకోవచ్చని అతడికి సూచించింది.

చమురు, గ్యాస్ మా దగ్గరే కొనాలి

- లేదంటే పన్నుల కొరడా ఝుళిపిస్తా
- ఈయూకు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల పర్వం కొనసాగుతున్నది. పన్నులు తగ్గించాలని ఇటీవల భారత్‌ను హెచ్చరించిన ఆయన ఈసారి యూరోపియన్ యూనియన్‌పై విరుచుకుపడ్డారు. అమెరికా-యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య లోటును తగ్గించకపోతే, పన్నుల కొరడా ఝుళిపిస్తానని శనివారం హెచ్చరించారు. చమురు, సహజ వాయువు అత్యధికంగా అమెరికా వద్ద కొనాలని చెప్పారు. ఈ విషయాన్ని తాను యూరోపియన్ యూనియన్‌కు తెలియజేశానని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్ ద్వారా వెల్లడించారు. 2016-2020 మధ్య కాలంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా ట్రంప్ ఇదే వైఖరిని అవలంబించారు. యూరోప్ చాలా కాలం నుంచి అమెరికా వీపుపై గుర్రపు స్వారీ చేస్తున్నదన్నారు. అలా జరగడానికి అవకాశం ఇచ్చినది అమెరికాయేనని చెప్పారు.

అదృష్టమంటే వారిదే!

ఎస్‌యూవీ 8 పల్టీలు కొట్టినా ప్రయాణికులంతా సురక్షితం

బికనీర్: అదృష్టమంటే ఆ కారులోని ప్రయాణికులదే. ఆ ప్రమాద దృశ్యం చూసినవారెవరైనా కారులోని వారంతా చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరుగుతుందని భావిస్తారు. అయితే ఒంటిపై చిన్న గాయం కూడా కాకుండా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. జాతీయ రహదారిపై అతి వేగంగా వస్తున్న ఒక కారు అదుపు తప్పి 8 పల్టీలు కొట్టిన ఘటన రాజస్థాన్‌లోని నాగౌర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులోని ఐదుగురూ ఎలాంటి గాయాలు కాకుండా తప్పించుకోవడం విశేషం. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి. నాగౌర్ నుంచి బికనీర్‌కు ఐదుగురు ప్రయాణికులతో ఒక ఎస్‌యూవీ కారు వెళ్తుండగా, మలుపు తిప్పుతున్న సమయంలో కారుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో సెకన్ల వ్యవధిలో కారు 8 పల్టీలు కొట్టి రోడ్డు పక్కనే ఉన్న ఒక కార్ల షోరూం గేట్‌పై తల్లకిందులుగా పడి ఆగిపోయింది. ప్రమాదం తర్వాత బయటపడ్డ వారు షోరూమ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి 'మాకు టీ ఇవ్వండి' అని అడగటం ఆశ్చర్యపరిచింది.